క్లుప్తంగా

పెద్ద అంబర్‌పేటలో సాయినగర్ విలీనం

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని సాయినగర్ గ్రామ పంచాయతీ రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో విలీనమైంది. శుక్రవారం పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి సాయినగర్ పంచాయతీ కార్యాలయంలోని రికార్డులన్నింటినీ స్వాధీనం చేసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం బోర్డు తొలగించారు. భవనానికి రంగులు వేసి వార్డు కార్యాలయంగా పేరు మార్చనున్నట్లు కమిషనర్ తెలిపారు. కాగా భూదాన్‌పోచంపల్లి మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో సాయినగర్ విలీనంతో 21కు తగ్గాయి.

ఆర్థికసాయం అందజేత

గుండాల : మండలంలోని మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన పాలడుగు యాదమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గ్రామ యువకులు రూ.10 వేల ఆర్థికసాయాన్ని శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. వారివెంట రవికుమార్, హరీష్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, రిషిరెడ్డి, రామకృష్ణారెడ్డి, వంశీరెడ్డి, నర్సింహ, రామచంద్రయ్య, వీరారెడ్డి పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని సీతవానిగూడెం గ్రామానికి చెందిన ఒంటెద్దు సాయికుమార్ ఇటీవల మృతి చెందాడు. మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్‌రెడ్డి అందించిన రూ.5వేల ఆర్థిక సాయాన్ని కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షుడు సామల సుధాకర్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు.

పౌర హక్కుల దినోత్సవం

మోత్కూరు : మండలంలోని పాలడుగు గ్రామంలో మోత్కూరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దాసరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు దాసరి తిరుమలేష్, మాట్లాడుతూ.. కుల, మత, జాతి, లింగ విభేదాలు చూపరాదన్నారు. అంటరానితనం, వివక్ష చూపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగరాజు, డాక్టర్ హేమంత్‌కుమార్, మండల వ్యవసాయాధికారి వర్ధమాన్ కీర్తి, మాజీ ఉప సర్పంచ్ ఎడ్ల భగవంత్, దళిత నాయకులు కొంగరి బాలరాజు, చంద్రయ్య, ప్రశాంత్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణం చేపట్టాలి



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని గుజ్జ గ్రామంలో వివిధ గ్రామాలను కలిపే లింక్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆ గ్రామ యువకులు, ప్రజలు కలిసి శనివారం నిరసన తెలిపారు. పాదయాత్ర నిర్వహించి గ్రామపంచాయతీ వద్ద దీక్ష నిర్వహించారు. గుజ్జ గ్రామం నుంచి చల్మెడ, ఏపూరు, లింగవారిగూడెం, కోతులారం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎలిజాల శ్రీను, చిన్నం ప్రశాంత్ కుమార్, బొద్దుల సాంబశివరావు, పగిళ్ల శ్రీకాంత్, ఏనుగుల బాబు, చిన్నం రాజీవ్, శంకర్ తదితరులున్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

భూదాన్‌పోచంపల్లి: వరి ధాన్యానికి మద్దతు ధర పెంచినందుకు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని నేతాజీ చౌరస్తాలో బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ధాన్యం మద్దతు ధర పెంచడంతో పాటు యూరియాపై సబ్సిడీ, పంట పెట్టుబడి సాయం, ఫసల్‌బీమా యోజన పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మండల, పట్టణ అధ్యక్షులు మేకల రవీందర్‌రెడ్డి, డబ్బీకార్ సాహేశ్, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సుర్కంటి రంగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మేకల చొక్కారెడ్డి, బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ చిక్క కృష్ణ, బస్వలింగం, గణేశ్, రమేశ్, లింగయ్య పాల్గొన్నారు.

బునాదిగాని కాల్వ పనులు సత్వరమే పూర్తిచేయాలి

మోత్కూరు : బీబీనగర్, వలిగొండ, మోటకొండూర్, ఆత్మకూరు(ఎం), మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు సాగు నీరు అందించే బునాదిగాని కాల్వ పనులను సత్వరమే పూర్తి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. శనివారం మోత్కూర్‌లోని కేఆర్ భవన్‌లో సీపీఐ మండల కౌన్సిల్ సమావేశం గొలుసుల యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మోత్కూరు పట్టణ శాఖ నూతన కార్యదర్శిగా బోయిని ఉప్పలయ్య, సహాయ కార్యదర్శిగా గొలుసుల యాదగిరి, కడమంచి వీరస్వామిలను ఎన్నుకున్నారు. కొండగడప గ్రామ శాఖ కార్యదర్శిగా తొంట తిరుపతయ్య, పాటిమట్ల కార్యదర్శిగా దొండ రాములు, దాచారం కార్యదర్శిగా సిరిగిరి మచ్చగిరి, బుజిలాపురం కార్యదర్శిగా చేతరాశి సత్తయ్య, పొడిచేడు కార్యదర్శిగా ఎర్రబాబు, దత్తప్పగూడెం కార్యదర్శిగా వల్లపు అంతయ్య, ముశిపట్ల కార్యదర్శిగా ఎండీ అబ్బాస్‌అలీలను ఆయా శాఖల సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య, పార్టీ మాజీ కార్యదర్శి పుల కరం మల్లేషం, నాయకులు పాల్గొన్నారు.

చెట్ల నీడే దిక్కు!

- వంగపల్లి - మోటకొండూర్ బైపాస్ జంక్షన్ వద్ద బస్‌షెల్టర్ కరువు
- ఎండకు, వానకు ప్రయాణికులకు తప్పని అవస్థలు
- బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని వేడుకోలు



వంగపల్లి - మోటకొండూర్ జంక్షన్ వద్ద చెట్ల కింద నిరీక్షిస్తున్న ప్రయాణికులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామం వద్ద, వంగపల్లి–మోటకొండూర్ మండలానికి వెళ్లే ప్రధాన రహదారిలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం, ఎండాకాలంలో బస్ షెల్టర్ లేక అవస్థలు పడుతూ, చెట్ల కిందనే నిరీక్షించాల్సి వస్తోంది. ప్రభుత్వ పాలకులు, ఆర్టీసీ అధికారులు స్పందించి ఈ రహదారిలో బస్‌షెల్టర్ నిర్మించాలని వేడుకుంటున్నారు.

నిత్యం రద్దీ

మోటకొండూర్ మండల కేంద్రం నుంచి వయా వంగపల్లి గ్రామం మీదుగా జిల్లా కేంద్రమైన భువనగిరి, మండల కేంద్రమైన యాదగిరిగుట్ట, నియోజకవర్గ కేంద్రమైన ఆలేరు ప్రాంతానికి నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలో మోటకొండూర్ వెళ్లే రహదారి వద్ద అధికారులు అండర్ పాస్ నిర్మాణాన్ని కూడా చేపడుతున్నారు. కానీ ప్రయాణికులు నిలబడడానికి మాత్రం బస్ షెల్టర్ నిర్మించడం లేదు.

బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయాలి



వంగపల్లి బైపాస్ నుంచి మోటకొండూర్ మండలానికి వెళ్లే ప్రధాన రహదారిలో, ప్రయాణికులకు బస్టాండ్ సౌకర్యం లేదు. చెట్ల కింద నిలబడాల్సి వస్తోంది. కూర్చోవడానికి ఎలాంటి సదుపాయాలు లేవు.

– తోటకూరి బీరయ్య, చొల్లేరు మాజీ సర్పంచ్

అవస్థలు పడుతున్నాం



వంగపల్లి బైపాస్ వద్ద బస్‌షెల్టర్ లేక అనేక అవస్థలు పడుతున్నాం. చెట్ల కింద నిలబడి నిరీక్షించాల్సి వస్తుంది. వర్షాలు వస్తే చెట్లు తప్ప ఏమీ లేవు. అధికారులు చర్యలు తీసుకుని ఈ రూట్లో బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయాలి.

– మచ్చ బలరాం, మహబూబ్‌పేట

అభివృద్ధిలో ప్రభుత్వానికి సహకరిస్తాం

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



మాట్లాడుతున్న గొంగిడి సునీత, నాయకులు

ఆలేరు : అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరిస్తామని, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. శనివారం ఆలేరు పట్టణంలోని పాల శీతలీకరణ కేంద్రంలోని అతిథి గృహంలో ఆ పార్టీ నేతలతో సమావేశమయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజల హక్కుల సాధనకు బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందన్నారు. రెవెన్యూ డివిజన్‌గా ఆలేరుకు అన్ని రకాల అర్హతలు ఉన్నాయని, గతంలో తాము ప్రతిపాదనలు చేశామన్నారు. ఇప్పుడు అధికార పార్టీ ఈ విషయాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని సూచించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆలేరు అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చానని పేర్కొన్నారు. 2వ తేదీన గ్రామ, మండల కేంద్రాల్లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని పార్టీ నేతలకు సూచించారు. జాతీయ జెండాతో పాటు పార్టీ పతాకాల ఆవిష్కరణ, అమర వీరుల కుటుంబాలకు సన్మానం, సేవా కార్యక్రమాలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ శంకరయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, యాదగిరిగుట్ట మండల పార్టీ అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, సింగిల్‌విండో చైర్మన్ ఇమ్మిడి రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్, గంగుల శ్రీనివాస్, హరినాథ్, కుమార్ తదితరులున్నారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

- కలెక్టర్ హనుమంతరావు



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

తుర్కపల్లి: ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం తుర్కపల్లి మండల పరిధిలోని వెంకటపురం గ్రామంలో ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీ బాయి ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెను సన్మానించి మాట్లాడారు. పంచాయతీరాజ్ శాఖలో ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డిప్యూటీ సీఈఓ విష్ణువర్ధన్, ప్రత్యేక అధికారి మోతిలాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్‌రెడ్డి, పంచాయతీరాజ్ మిని స్టెనోగ్రాఫర్ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, టీజీఓ నాయకులు మందడి ఉపేందర్ రెడ్డి, జగన్మోహన్‌ప్రసాద్, ఎంపీడీఓ జిల్లా అధ్యక్షుడు, శ్రీనివాస్‌రెడ్డి, బాలరాజు రెడ్డి, తహసీల్దార్ దేశ్యానాయక్ పాల్గొన్నారు.

ప్రధాన సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లా

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో ఆర్టీసీ బస్ డిపో, 30 పడకల ఆస్పత్రి, బిక్కేరుపై నూతన బ్రిడ్జి నిర్మాణం త్వరలో పరిష్కారమవుతాయని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తెలిపారు. శనివారం మోత్కూరు అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయా శాఖల మంత్రుల దృష్టికి తీసుకెళ్లానని, సానుకూలంగా స్పందించారని చెప్పారు. మోత్కూరును పోలీస్ సర్కిల్‌ను చేయాలని సీపీ కమిషనర్ సుధీర్‌బాబును ఫోన్‌లో ఎమ్మెల్యే సామేల్ కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. మోత్కూరు, అడ్డగూడూరు పోలీస్ స్టేషన్‌లకు ప్రత్యేకంగా సీఐ, ఎస్‌హెచ్‌ఓ పోస్టులను మంజూరు చేస్తానని సీపీ హామీ ఇచ్చారని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పైళ్ల సోమిరెడ్డి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి, జిల్లా నాయకులు గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, అవిశెట్టి అవిలుమల్లు, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రాచకొండ బాలరాజు గౌడ్, పట్టణ అధ్యక్షులు రామచంద్రు గౌడ్ ఉన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మోత్కూరు : మండలానికి చెందిన 87 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు మంజూరైన రూ.87,10,092 విలువ గల చెక్కులను ఎమ్మెల్యే సామేల్ శనివారం మోత్కూరు మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. త్వరలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద రూ.100116లతో పాటు తులం బంగారం ప్రభుత్వం అందజేయనున్నదని ఎమ్మెల్యే తెలిపారు. బస్వాపూర్ ప్రాజెక్టును బునాదిగాని కాల్వకు అనుసంధానం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ బాలాజి, ఎంపీఓ పైళ్ల జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధూమపానం ఆరోగ్యానికి హానికరం



భువనగిరిలో జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మనోహర్

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మనోహర్

భువనగిరి: ధూమపానం ఆరోగ్యానికి హానికరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మనోహర్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్ర ఆస్పత్రి నుంచి జగదేవ్‌పూర్ చౌరస్తా వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సుమన్ కళ్యాణ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యశోద, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రామకృష్ణ, వీణ, సైకియాట్రిస్ట్ ప్రీతి స్వరూప్, డాక్టర్ నిరోష, డెమో అంజయ్య, జ్ఞానేశ్వర్, వసంత కుమారి, సత్యవతి, ఇస్తారి, మరియమ్మ పాల్గొన్నారు. అదేవిధంగా బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో భువనగిరి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో పొగాకు తీసుకోవడం ద్వారా కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి చంద్రావతి, బ్రహ్మచారి, నరేందర్, రమణేశ్వర్, అరుణ, రాధమ్మ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయొద్దు

చౌటుప్పల్ : బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయొద్దని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి మహతీవైష్ణవి అన్నారు. ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పొగాకులోని నికోటిన్ పదార్థం మూలంగా ప్రాణాంతకమైన క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు సంక్రమించడంతోపాటు అకాల మరణాలు సంభవిస్తాయన్నారు. పొగాకు రహిత సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పడమటి మహిపాల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎలమోని శ్రీనివాస్, ఊడుగు శ్రీనివాస్, న్యాయవాదులు ముత్యాల సత్తిరెడ్డి, జెల్ల రమేష్, తాడూరి పరమేష్, ఎండీ ఖయ్యూం, రవీందర్, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐ నర్సిరెడ్డి పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

భూదాన్‌పోచంపల్లి: యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని మండల వైద్యాధికారిణి శ్రీవాణి అన్నారు. శనివారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తుల కారణంగా ఆరోగ్యంపై దుష్పరిణామాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పోతారెడ్డి, సూపర్‌వైజర్లు అరుంధతి, శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మణ్‌బాబు, బేగ్, భవాని, వాణి, నాగమణి, లత, ఆరోగ్యకేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చౌటుప్పల్ : మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మహతీవైష్ణవి



భూదాన్‌పోచంపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పొగాకు వ్యతిరేక దినోత్సవం

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మోత్కూరు, బుజిలాపురం, పొడిచేడు, దాచారం, పాటిమట్ల, కొండగడప, ముశిపట్ల ఆరోగ్య ఉప కేంద్రాల్లో పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో వైద్యాధికారి హేమంత్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు దివ్య, సుష్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

రామన్నపేట: పొగ తాగడం ఆరోగ్యానికి హానికరమని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, సీనియర్ సివిల్‌జడ్జి సబిత అన్నారు. శనివారం రామన్నపేట గ్రామపంచాయతీ ఆవరణలో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. మాదక ద్రవ్యాల జోలికి వెళ్లబోమని స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎస్. వెంకటేశ్వర్లు, డాక్టర్ దేవేందర్‌రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మజీద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

3 నుంచి రెవెన్యూ సదస్సులు

భువనగిరి: ఈనెల 3నుంచి భువనగిరి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అంజిరెడ్డి శనివారం తెలిపారు. 3న కేసారం, 4న పగిడిపల్లి, వడపర్తి, 5న కూనూరు, ముస్యాలపల్లి, అనాజీపురం, 6న ఎర్రంబెల్లి, నాగిరెడ్డిపల్లి, 9న సూరేపల్లి, బాగాయత్ భువనగిరి, 10న గౌస్‌నగర్, హన్మాపురం, తాజ్‌పూర్, 11న తుక్కాపురం, బీఎన్‌తిమ్మాపురం, 12న చందుపట్ల, నందనం, 13న పెంచికల్‌పహాడ్, బోల్లేపల్లి, 16న బస్వాపురం వీరవెల్లి, 17న బండసోమారం, హుస్నాబాద్, 18న అనంతారం, రామచంద్రపురం, 19న రాయగిరి, చీమలకొండూరు, 20న భువనగిరి, బొమ్మాయిపల్లిలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అడ్డగూడూరు: ఈనెల 3వ తేదీ నుంచి 17 వరకు భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శేషగిరిరావు శనివారం తెలిపారు. 3న చిన్నపడిశాల, 4న ధర్మారం, 5న జానకీపురం, 6న చౌల్ల రామారం, 9న డి.రేపాక, 10న చిర్రగూడూరు, 11న వెల్దేవి, 12న కోటమర్తి, 13న కంచనపల్లి, 16న గట్టుసింగారం, 17న అడ్డగూడూరులో సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రామన్నపేట: మండల వ్యాప్తంగా ఈనెల 3వ తేదీ నుంచి 17 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ లాల్‌బహదూర్‌శాస్త్రి తెలిపారు. ఈనెల 3న బోగారం, బాచుప్పల, 4న నీర్నెముల, బి.తుర్కపల్లి, 5న నిధానపల్లి, జనంపల్లి, 6న దుబ్బాక, ఎన్నారం, 9న లక్ష్మాపురం, కుంకుడుపాముల, 10న సిరిపురం, ఇస్కిళ్ల, 11న శోభనాద్రిపురం, మునిపంపుల, 12న పల్లివాడ, సూరారం, 14న తుమ్మలగూడెం, ఉత్తటూరు, 16న వెల్లంకి, కక్కిరేణి, 17న రామన్నపేటలో సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అహల్యబాయి చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

యాదగిరిగుట్ట: అహల్యబాయి పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. రాణి అహల్యబాయి జయంతిని పురస్కరించుకొని శనివారం యాదగిరిగుట్ట పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్‌గౌడ్, శోభాయాత్ర జిల్లా కన్వీనర్ పాదరాజు ఉమాశంకర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాధూరి చంద్ర, పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, అధ్యక్షురాలు గుంటిపల్లి మహేశ్వరి, దయ్యాల కుమారస్వామి, సృజన్‌గౌడ్, దాసరి మల్లేశం, అశోక్, శ్రీనివాస్ తదితరులున్నారు.

అత్యున్నత స్థానానికి ఎదగాలి

సంస్థాన్ నారాయణపురం: విద్యార్థులు జీవితంలో యోగా, క్రీడలను భాగం చేసుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని యువజన, క్రీడల జిల్లా అధికారి ధనుంజయులు అన్నారు. ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం శనివారం సంస్థాన్ నారాయణపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్‌ఐ కట్ట శివశంకర్‌రెడ్డి, ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ అధికారి భార్గవి, తైక్వాండో మాస్టర్ గుర్రం కృష్ణ, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు సిలువేరు సైదులు, బద్దుల మురళి, తెలంగాణ భిక్షం, భరత్ వెంకటేష్, నరేష్, రవికాంత్‌చారి తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారిణి రమణి

భూదాన్‌పోచంపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని మండల ప్రత్యేకాధికారిణి రమణి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం భూదాన్‌పోచంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 6 నుంచి నిర్వహించే బడిబాట కార్యక్రమం ద్వారా బడీడు పిల్లలు, బడిబయటి పిల్లలు, డ్రాపవుట్స్, బడి మానేసిన పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. మండలంలోని 21 గ్రామపంచాయతీల్లో మంజూరైన 450 ఇందిరమ్మ ఇళ్లను త్వరలో స్థానిక ఎమ్మెల్యే ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ ప్రభాకర్, ఎంపీఓ మాజిద్, మండల వైద్యాధికారి శ్రీవాణి, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తిరంగా ర్యాలీ



తుర్కపల్లిలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

తుర్కపల్లి: మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలు శనివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్, యాట పెంటయ్య, కందూరి చెలమయ్య, కొక్కొండ లక్ష్మీనారాయణ, శత్రునాయక్, రాజు, సత్యనారాయణ, వెంకటేష్, ఆంజనేయులు, సందీప్‌చారి, సంతోష్, భాస్కర్ పాల్గొన్నారు.

గుండాల : ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో భారత సాయుధ దళాలకు గౌరవ సూచకంగా గుండాలలో శనివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం సింధూర్ ఆపరేషన్‌లో ప్రాణాలు కోల్పోయిన అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సోమనర్సయ్య, విజయరెడ్డి, నాగయ్య, మల్లేష్, శ్రీనివాస్, బాలలింగం తదితరులు పాల్గొన్నారు.



గుండాలలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

జలనారాయణుడికి మంగళహారతులు



స్వామివారికి మంగళహారతులు సమర్పిస్తున్న అర్చకులు

భువనగిరి: పట్టణంలోని స్వర్ణగిరి క్షేత్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామి వారికి ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రమార్చన, నిత్య కల్యాణం, సాయంత్రం తిరువీధి సేవ, రాత్రి జలనారాయణ స్వామికి మంగళహారతులు చేపట్టారు.

సంక్షిప్త సమాచారం

→ పాఠ్య పుస్తకాల పంపిణీ

గుండాల : ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను శనివారం గుండాల మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ మన్నె అగ్గిరాములు ఉపాధ్యాయులకు అందజేశారు. పాఠశాలు తెరిచిన మొదటి రోజునే విద్యార్థులకు పుస్తకాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ లింగయ్య, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

వలిగొండ : మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో శనివారం మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యార్థులకు అందజేసేందుకు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు నాగేందర్, జిలాని, స్వామి రాజ్, కృష్ణ ప్రసాద్, ప్రభాకర్, కనకదుర్గ మల్లేశం, చండీప్రసాద్, వెంకటేశం, రాంబాబు, పరమేష్, పాండు, భిక్షమయ్య పాల్గొన్నారు.

→ పోలీసులకు ఫిర్యాదు

చౌటుప్పల్ : ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దూషించినట్లుగా అసత్యపు కథనాన్ని ప్రచురించిన డిజిటల్ పత్రిక యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ మన్మథకుమార్‌కు ఫిర్యాదు చేశారు. వారిలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మార్కెట్ వైస్‌చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, నాయకులు బొబ్బిళ్ల మురళి, మొగుదాల రమేష్, సుర్వి నర్సింహ, బోయ దేవేందర్, ఎండీ బాబాషరీఫ్, బొంగు జంగయ్య, కంచరకుంట్ల రాంరెడ్డి, బొడిగె బాలకృష్ణ, పాక చిరంజీవి ఉన్నారు.

→ నష్టపరిహారం చెల్లించాలి

భువనగిరి: బస్వాపురం రిజర్వాయర్ ముంపు బాధితులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ అన్నారు. శనివారం భువనగిరిలోని ఆర్డీఓ కార్యాలయంలో అధికారులను కలిశారు. బీఎన్ తిమ్మాపురంలో ముంపునకు గురవుతున్న ఇళ్లకు మొత్తం రూ.109 కోట్లు రావాల్సి ఉండగా రూ.30 కోట్లు విడుదల చేశారన్నారు. ఈ నిధులను వెంటనే ముంపు బాధితులైన దళితులకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బట్టు రాంచంద్రయ్య, మల్లేష్, ఇటుకల దేవేందర్, సురుపంగ శివలింగం, రామకృష్ణ, దళితులు మైసయ్య, ఉపేందర్, మహేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

→ రజాకార్, పుష్ప సినిమాలకు అవార్డులు ఇవ్వడం సరికాదు

మోత్కూరు : సాయుధ పోరాట అమరులను కించపరిచే విధంగా రూపొందించిన రజాకార్ సినిమాకు ఉత్తమ చారిత్రక వారసత్వం చిత్రం అవార్డు, ఎర్రచందనం స్మగ్లర్ పాత్రకు ఉత్తమ నటుడి అవార్డు ప్రకటించడాన్ని సీపీఎం మోత్కూరు మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు ఖండించారు. శనివారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన వెంట మండల నాయకులు దడిపల్లి ప్రభాకర్, కురుమేటి యాదయ్య ఉన్నారు.

→ జాడ అంజయ్యకు సన్మానం

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలోగల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న జాడ అంజయ్య శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కార్యనిర్వహణ అధికారి మోహన్‌బాబు, ధర్మకర్తల మండలి చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ రెడ్డి సన్మానించారు.

→ శిక్షణ శిబిరాలు నైపుణ్యానికి దోహదం

యాదగిరిగుట్ట రూరల్: వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థుల నైపుణ్యానికి దోహదం చేస్తాయని ప్రధానోపాధ్యాయుడు గవ్వల రాములు అన్నారు. శనివారం యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిబిరంలో విద్యార్థులకు స్నాక్స్, తాగునీరు అందించిన దాతలు కర్రె కృష్ణ, పల్లెపాటి మాధవ్‌లు, దేవనూరి గోవిందలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాజు, సిద్దులు, భానుప్రసాద్, వెంకటకృష్ణ, సతీష్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

→ సిబ్బందిని పెంచాలి

మోత్కూరు: మోత్కూరు ఎస్‌బీఐ శాఖలో సిబ్బందిని పెంచి ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం బ్రాంచ్ మేనేజర్ తులసికి ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పల శాంతికుమార్ ఆధ్వర్యంలో ఖాతాదారులు వినతిపత్రం అందజేశారు. వారిలో చిప్పలపల్లి తరుణ్, బన్ని, రాంపాక చందు, నర్సింహ, స్వామి, ప్రభాకర్, శ్రీకాంత్, నరేష్ తదితరులున్నారు.

మురుగు నీరు చేరింది.. కంటైనర్ దిగబడింది

రామన్నపేట: రామన్నపేట పోలీస్‌స్టేషన్ ఎదుట మురుగునీరు చేరింది. ఈక్రమంలో స్టేషన్ ముందు పార్క్‌చేసిన కంటైనర్ ముందు టైరు మురుగునీటిలో దిగబడి పక్కకు ఒరిగింది. అప్రమత్తమైన పోలీసులు క్రేన్‌ను తెప్పించి కంటైనర్‌ను బయటకు తీయించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు మురుగు కాలువ నిర్మాణపనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



మురుగునీటి గుంతలో దిగబడిన కంటైనర్‌ను క్రేన్ సాయంతో బయటకు తీస్తున్న దృశ్యం